RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
అక్టోబర్ : 09 బుధవారం సంపుటి : 28 సంచిక : 241

## బాణాసంచా దుకాణాల ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్



అగ్ని న్యూస్,మార్కాపురం (అక్టోబర్ 08): దీపావళి పండగ వేళ బాణాసంచా దుకాణ దారులకు ఇచ్చే అనుమతుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అధికారులకు సూచించారు. స్థానిక ఎస్వీకేపీ కళాశాల ప్రాంగణాన్ని వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు.బాణాసంచా విక్రయాలకు ఎస్వీకేపి కళాశాల ప్రాంగణం అనువుగా ఉన్న నేపథ్యంలో  అక్కడ దుకాణాలకు సంభందించిన ఏర్పాట్లు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట మార్కాపురం సీఐ సుబ్బారావు, పలువురు ఎస్ఐ లు ఉన్నారు.

## పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యేలు




అగ్ని న్యూస్, ఒంగోలు (అక్టోబర్ 08): ఒంగోలు లో మంగళవారం నిర్వహించిన పలు కార్యక్రమాలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి లు పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఫంక్షన్ హాల్ నందు ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రమాద బీమా పాలసీ పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.అనంతరం మధ్యాహ్నం ఒంగోలు నగరంలోని ప్రకాశం భవన్ నందు స్వర్ణాంధ్ర -2047 కార్యక్రమం లో మంత్రులు, కలెక్టర్ నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని ఇతర శాసనసభ్యుల తో కలిసి పాల్గొన్నారు.

## ఫ్రెషేర్స్-డే వేడుకల్లో పాల్గొన్న మాజి ఎమ్మెల్యే అన్నా






### - అట్టహాసంగా కిట్స్ లో ఫ్రషర్స్ డే వేడుకలు

అగ్ని న్యూస్,మార్కాపురం (అక్టోబర్ 08) : స్థానిక కిట్స్ కాలేజి నందు ఫ్రెషర్స్-డే వేడుకల్లో  కాలేజీ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి, విద్యార్థినులు తల్లి తండ్రుల కష్టం గుర్తెరిగి,క్రమశిక్షణతోమెలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి అని ఆకాక్షించారు. తమ కళాశాలలో విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడం తో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి,ఏఓ ప్రభాకర్,పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అద్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలి


- ముంపు గ్రామాలకు ఆర్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలి
- వెనుకబడిన పశ్చిమ ప్రాంతమైన మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి
- సిపిఐ రౌండ్ టేబుల్ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్




అగ్ని న్యూస్,మార్కాపురం (అక్టోబర్ 08): నిరంతరం కరవు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి ఏకైక పరిష్కార మార్గమైన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు తక్షణమే రూ.2 వేల కోట్లు వచ్చే బడ్జెట్లో కేటాయించాలని,అలాగే ఈ ప్రాంత ప్రజల పరిపాలన సౌలభ్యం దృష్ట్యా మార్కాపురం కేంద్రంగా జిల్లా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశానికి ఆశాకిరణమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో జిల్లా పార్టీ కార్యదర్శి ఎం ఎల్ నారాయణ అధ్యక్షతన అఖిలపక్ష  ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.ముఖ్య అతిథిగా హాజరైన కె. రామకృష్ణ మాట్లాడుతూ గత ఏడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశానికి వెలిగొండ ప్రాజెక్టే శరణ్యమని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన జరిగి 28 సంవత్సరాలు దాటుతున్నప్పటికీ నేటికీ పనులు పూర్తి కాలేదంటే ఈ ప్రాంతం పట్ల పాలకవర్గాలకు ఎంత చిత్తశుద్ధి ఉందో స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు. ఈ  ప్రాజెక్టు నిర్మాణం కోసం సిపిఐ నాయకులు స్వర్గీయ గుజ్జుల యలమందరెడ్డి, పూల సుబ్బయ్య, సానికొమ్ము కాశిరెడ్డి, రావుల చెంచయ్య తదితర నాయకుల ఆధ్వర్యంలో అనేక దశాబ్దాల పోరాటాల ఫలితమే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణానికి చేరువ అయిందని గుర్తు చేశారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన 11 ముంపు గ్రామాల ప్రజలను ఆదుకోవాల్సిన పాలకవర్గాలు వారికి ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా మరోవైపు వారి జీవితాలతో ఆటలాడు

6లో


## చంద్రబాబు ఎదుట అతి పెద్ద సవాల్...!



(అగ్ని ప్రతినిధి, అమరావతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావొస్తోంది. ఐదేళ్ల వైసీపీ పాలన మరకలు ఇప్పటికీ చెరిగిపోలేదు. గాడి తప్పిన వ్యవస్థలను సరిదిద్దడంతో పాటు ఏపీని తిరిగి ప్రగతి పథంలో నిలుపుతారని చంద్రబాబుపైన రాష్ట్ర ప్రజలు గంపెడాశ పెట్టుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వానికినిధుల కొరత అతి పెద్ద అడ్డంకిగా మారిందనేది వాస్తవం. ఐదేళ్ల జగన్ పాలనలో దాదాపు రూ.8 లక్షల కోట్లు పైగా అప్పులు చేశారనేది కేంద్ర ప్రభుత్వ మాట. ఇక టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కూడా రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలో దింపేశాడని తొలి నుంచి విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఐదేళ్ల పాలనలో జగన్ కేవలం సంక్షేమ పథకాల అమలుపైనే ఫోకస్ పెట్టాడని... అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేశారనే విమర్శలు తొలి నుంచి వినిపిస్తున్నాయి. దీంతో రాష్ట్ర ఖజానా పూర్తిగా ఖాళీ అయ్యింది. చివరికి జీతాలకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందనేది వాస్తవం. ప్రతి శుక్రవారం ఇండెంట్ పెట్టడం... మంగళవారం అప్పు తెచ్చుకోవడం... దానిని పంచి పెట్టడం అనేది రొటీన్‌గా జరిగిపోయింది. జగన్ సర్కార్ వేధింపుల కారణంగా ఏపీకి పెట్టుబడులు కూడా రాలేదు. దీంతో ఆదాయం పూర్తిగా కుంటు పడిపోయింది. జగన్ సర్కార్ లోపాలను ప్రధానంగా ఎత్తిచూపిన నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నిలిపే బాధ్యత నాది అని ఎన్నికల్లో భరోసా ఇవ్వడంతో... ఓటర్లు ఏకపక్షంగా ఓట్లు వేశారు. దీంతో వైసీపీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. అయితే ఇక్కడే చంద్రబాబు సర్కార్‌కు అసలు సిసలు టాస్క్ మొదలైంది. ప్రధానంగా ఏపీలో రహదారుల మరమ్మతుల సమస్య ప్రభుత్వానికి పెను సవాల్‌గా మారింది. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏపీలో రహదారుల దుస్థితిపై ప్రత్యక్ష పోరాటాలు చేశారు. గుంతలమయమైన రోడ్ల గురించి సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తూర్పుగోదావరి, అనంతపురం జిల్లాల్లో రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపారు. చివరికి మీడియాలో కూడా రోడ్ల దుస్థితిపై ఎన్నో కథనాలు వెలువడ్డాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రహదారులను మరమ్మతు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు హామీ నెరవేర్చడం కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. ఖజానాలో చిల్లిగవ్వ లేదని ఓ వైపు సీఎం చంద్రబాబు స్వయంగా చెబుతున్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలుపైనే ప్రధానంగా దృష్టి పెట్టారు. ఈ సమయంలో రోడ్ల మరమ్మతుకు కనీసం 10 వేల కోట్లు కావాలని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. చాలా చోట్ల అత్యంత దయనీయంగా రోడ్లు మారిపోయాయి. వీటిని తక్షణమే మరమ్మతు చేయాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రిని వేడుకుంటున్నారు. అయితే వీటికి నిధులను ఎలా సేకరించాలనే అంశంపై అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహిస్తున్నారు. వర్షాకాలం ముగియడంతో... జూన్ నెల లోపు రహదారులను మరమ్మతు చేయాలనేది లక్ష్యంగా కూటమి సర్కార్ ప్లాన్ చేస్తోంది.

# కొండచిలువ కలకలం



అగ్ని న్యూస్,పొదిలి(అక్టోబర్ 08) : మండలం లోని కంబాలపాడు లో ఓ ఇంటిదగ్గర కొండచిలువ కలకలం సృష్టించింది. ఇంటి సమీపంలోని ఖాళీ స్థలం లోని ఓ నెట్ లో ఇరుక్కున్న కొండచిలువను స్థానికులు గుర్తించారు. సుమారు ఏడు అడుగులు ఉన్న కొండచిలువ ను చూసి జనం బెంబేలెత్తారు.ఫారెస్ట్ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించడం తో కొండచిలువను బంధించి తీసుకొని వెళ్ళి అడవిలో వదిలి పెట్టారు.

## నర్సాయపాలెం,గంగపాలెంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం




అగ్ని న్యూస్,యర్రగొండపాలెం (అక్టోబర్ 08): మండలంలోని గంగా పాలెం, నర్సాయపాలెం గ్రామాలలోని గ్రామ రైతు సేవ కేంద్రం నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు నర్సాయపాలెం సర్పంచ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సోదరులతో కలిసి సాగు చేస్తున్న కంది, ప్రత్తి, మిరప పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి,అనంతరం రైతు సేవ కేంద్రం వద్ద గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎల్.మాల్యాద్రి రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం కంది కల్లె దశలో ఉన్నందున కంది యొక్క చిగుర్లను ఒక అడుగు మేర కత్తిరించవలెనని, ఇలా చేయడం వలన పైరు ఏపుగా పెరిగి, కాయ తొలుచు పురుగును నివారించవచ్చని వివరించారు. అదే విధంగా తప్పనిసరి అయితే మొగ్గ దశలో పురుగు యొక్క గుడ్లను గుర్తించిన వెంటనే 5 శాతం వేప నూనె, క్లోరోపైరిఫాస్ 2.5 యం ఎల్ లేక క్వినాల్ ఫాస్ 2 మి. లీ /లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయడం వల్ల పురుగులను అరికట్టవచ్చును అని వివరించారు. అలాగే ప్రత్తి పంట పూత, కాయ దశలో ఉన్నందున ఈ సమయంలో గులాబి రంగు పురుగు ఆశించే అవకాశం ఎక్కువ ఉన్నదని, పురుగు యొక్క ఉధృతిని తెలుసుకోవడానికి ఎకరానికి 10 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని, అవసరమైతేనే పురుగుమందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి పి.ఆది రెడ్డి మాట్లాడుతూ మిరప పంటలో రసాయన ఎరువులు ఎక్కువగా వాడుతూ ,సేంద్రియ ఎరువులు వాడకపోవడం వల్ల సూక్ష్మధాతు లోపాలు ఎక్కువగా ఉండటం గమనించడం జరిగిందనీ ఈ సూక్ష్మ ధాతువులు నివారించడానికి మిరప నాటిన 30వ రోజు నుండి నెలకు ఒకసారి సూక్ష్మ పోషకాలు కలిపిన మిశ్రమాన్ని 2.5 మి. లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకొని ఈ సూక్ష్మపోషక లోపాలను నివారించుకోవచ్చని తెలియజేశారు. అదేవిధంగా నత్రజని 50% యూరియా గాను, మిగతా 50 శాతం అమ్మోనియం సల్ఫేట్, క్యాల్షియం అమోనియం నైట్రేట్ రూపంలో అలాగే పొటాషియం 50% మ్యూరేట్ ఆఫ్ పొటాస్ రూపంలోనూ మిగిలినది సల్ఫేట్ ఆఫ్ పొటాష్ రూపంలో అందించినట్లయితే నాణ్యమైన అధిక దిగుబడులను పొందవచ్చు అని వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సాయపాలెం సర్పంచ్ చిమట వెంకట రాములు, ఉద్యాన శాఖ అధికారి పి.ఆది రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారి ఎల్. మాల్యాద్రి రెడ్డి,డ్రిప్ ఇరిగేషన్- ఎంఐఏఓ పి.రామిరెడ్డి , వి ఏ ఏ ఏ.చైతన్య కుమార్, విహెచ్ఏ బి.నాగేంద్ర కుమార్ ఆయా గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## విశ్వకర్మ యోజన ట్రైనింగ్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలి




అగ్ని. న్యూస్,యర్రగొండపాలెం,(అక్టోబర్ 08): ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన ట్రైనింగ్ సెంటర్ ను ఎర్రగొండపాలెం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఎనుముల నాగేశ్వరరావు మంగళవారం సందర్శించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో విశ్వకర్మ యోజన దరఖాస్తు దారులు అందరు పుల్లల చెరువు రోడ్ షీలా స్కూల్ నందు త్వరలో ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం కానుందని కాబట్టి ఈ యొక్క అవకాశాన్ని లబ్ధిదారులు అందరూ ఉపయోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల సూర్యనారాయణ, సీనియర్ నాయకులు బాదరయ్య గౌడ్, నాగ చారి,ప్రతాప్ రెడ్డి, అశోక్ కుమార్ లోకేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కందులను కలిసిన ఎన్ఫోర్స్మెంట్ డిటీ



అగ్ని న్యూస్,మార్కాపురం (అక్టోబర్ 08): మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని నూతన ఎన్ఫోర్స్మెంట్ డిటీ అర్జున్ రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే కందుల తో కొద్ది సేపు తమ శాఖ పనితీరు గురించి మాట్లాడారు.

## నల్లగుంట్లలో పొలం పిలుస్తుంది




అగ్ని న్యూస్,పెద్ద దోర్నాల (అక్టోబర్ 08): దోర్నాల మండలంలోని నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి. జవహర్ లాల్ నాయక్ గ్రామం లో సాగు చేసిన కంది, మిరప పంటలను సందర్శించి కంది లో ఆకు చుట్టు పురుగు, ఏండు తెగులు ను గుర్తించారు.కంది లో ఆకు చుట్టు పురుగు ఆకులను, పూత ను చుట్టగా చుట్టుకొని లోపల ఉండి గీరి తింటుంది. నివారణకు క్లోరో ఫై రి ఫోస్ 2.5యం ల్ లేదా వేప గింజల కాషాయం 5 యం. ల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఏండు తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గామ్స్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.ఈ కార్యక్రమం లో ప్రకృతి వ్యవసాయం లో భాగంగా నల్లేరు కాషాయం చేయు విధానం, పంటల పై పిచికారీ చేయు విధానం గురించి సిబ్బంది తెలిపారు.ఈ కార్యక్రమం లో ఈ హెచ్ ఏ మల్లునాయక్, ఎన్ జి ఓ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వైభవంగా పోలేరమ్మ దేవస్థానం లో దసరా నవరాత్రులు



అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 08): పట్టణ సమీపంలోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానం లో దసరా నవరాత్రులుఎంతో వైభవంగా సాగుతున్నాయి. దేవీ నవరాత్రుల లో భాగంగా ఆరవ రోజు శ్రీ మహాకాళి శ్రీ మహాలక్ష్మి శ్రీ మహా సరస్వతి గ్రామరక్షకి శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవి అమ్మవారికి ప్రాతఃకాల పూజలు పంచామృత దుర్గా సహస్రనామ పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగినది.కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవ రెడ్డి పర్యవేక్షించారు.

## ధనలక్ష్మి అవతారం లో పార్వతి దేవి



అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 08): శ్రీదేవి శరన్నవరాత్రులు సందర్భంగా నెహ్రూ బజార్ సాయిబాబా మందిరం ఆవరణలో వేంచేసి ఉన్నటువంటి శ్రీ గంగా పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి వారి దేవస్థానము నందు ఆరవ రోజు మంగళవారం పరివార దేవతా సమేతంగా పార్వతీ పరమేశ్వరులకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము అమ్మవారికి ధనలక్ష్మి అలంకారము, సహస్రనామ విధానముగా కుంకుమార్చన, మహా పంచహారతులు,మహామంత్ర పుష్పం, చతుర్వేద స్వస్తి వివిధ పూజా కార్యక్రమాలు దిగ్విజయంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనిపూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఐసీడీఎస్ విశ్రాంత పీడీ యార్లగడ్డ ధనలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమాలను ఆలయ అర్చకులు మైలటూరి రవిశంకర్ శర్మ పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి కేవలం 499/- మాత్రమే only soft copy

## రైతుల కు రాయితీ పై శనగ విత్తనాలు




### - మిరప పంటను పరిశీలించిన అధికారులు

అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 08): మండలంలోని వేములకోట-2, చెన్నారాయుని పల్లి లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు రైతులు సాగు చేసిన మిరప పొలాలను సందర్శించారు. హేచ్. ఓ రమేష్ మిరప పంటలో రసం పీల్చే పురుగులు, వాటి నివారణ చర్యల గురించి రైతులకు సలహాలు ఇచ్చారు.పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని రైతుసేవా కేంద్రం నందు ఏ.ఓ దేవిరెడ్డి శ్రీనివాసులు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో ఆయన వ్యవసాయ పథకాల గురించి వివరించారు. ప్రస్తుతం శనగలు జెజి-11 రకము క్వింటాలు రూ.9400 పూర్తి ధర ఉండగా రూ.2350 రాయితీ, రైతు చెల్లించాల్సిన ధర రూ.7050 లకు శనగ విత్తనాలను ఆర్.యస్.కె ల ద్వారా అందించడం జరుగుతుందని, శనగ విత్తనాలు కావలసిన రైతులు ఆర్.యస్.కె లో ఉన్న సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేపించుకోవలని తెలియజేసారు.పశుసంవర్ధ శాఖ అధికారి విష్ణు వర్ధన్, పశువుల టీకా లపైన రైతులకు అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో వేములకోట2, చెన్నారాయుని పల్లి ఆర్.యస్.కె సిబ్బంది భాగ్య లక్ష్మీ, సుబ్బమ్మ, రైతులు పాల్గొన్నారు.

## 3,396 మద్యం దుకాణాలకు 20,310 దరఖాస్తులు



### - రూ.406 కోట్ల ఆదాయం

(అగ్ని ప్రతినిధి, అమరావతి)ఏపీలో మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియ నేటితో ముగియనుంది.మొత్తం 3,396 దుకాణాలకు గాను నిన్న రాత్రి వరకు 20,310 దరఖాస్తులు అందాయి.అత్యధికంగా విజయనగరంలో1,689 దరఖాస్తులొచ్చాయి. రూ.2 లక్షల నాన్ రీఫండబుల్ రుసుముతో ప్రభుత్వానికి రూ. 406.20 కోట్ల ఆదాయం లభించింది. రాష్ట్రంలో నేడు, రేపు భారీగాదరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## మధుర జ్ఞాపకాలతో మురిసిపోయారు..!






అగ్ని న్యూస్,మార్కాపురం(అక్టోబర్ 08):మండలం లోని గజ్జలకొండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కన్నుల పండుగ జరిగింది. 2008-09లో 10వ తరగతి చదివిన వీరంతా ఒక చోట కలిసి తీపి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఆ రోజుల్లో తరగతి గదిలో కూర్చొని చేసిన అల్లరి మరపురానిదని కొందరు విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. చదువు చెప్పిన గురువులను సన్మానించుకొని... పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా రూ. 25 వేలు అందజేశారు.

## అన్యమతస్థులకు దేవాలయ ప్రవేశం లేదు



### - హైకోర్ట్ సంచలన తీర్పు

(అగ్ని ప్రతినిధి,చెన్నై )ఇకపై అన్యమతస్థులకు దేవాలయ ప్రవేశం లేదని తమిళనాడు హైకోర్ట్ సంచలన తీర్పును ఇచ్చింది. ఈ సంధర్బంగా హైకోర్ట్ తీర్పునిస్తూ "హిందూ ఆలయాలు పిక్నిక్ స్థలాలు కాదు, హిందూ దేవాలయాలు పవిత్రతకు నిలయాలు. హిందూ ధర్మంపై నమ్మకం లేనివారికి ఆలయంలోకి ప్రవేశం ఎందుకు? ఇకపై ఇతర మతస్థులకు ఆలయాలలో ప్రవేశం లేదు. ఒక వేళ అన్యమతస్థులెవరైనా దేవాలయాలలోకి రావాలని కోరుకుంటే వారు తప్పనిసరిగా "నేను హిందూ దేవీ దేవతలను నమ్ముతున్నాను" అని ఆలయ సిబ్బంది వద్ద సంతకం పెట్టి దేవాలయంలోకి వెళ్ళాలి" అని మద్రాస్ హైకోర్ట్ సంచలన తీర్పును ఇచ్చింది. కాగ మద్రాస్ హైకోర్ట్ ఇచ్చిన ఈ తీర్పుతో డిఎంకె ప్రభుత్వం గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో: అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

# జగన్ జోస్యం ఫలిస్తుందా….?



(అగ్ని ప్రతినిధి, అమరావతి)

వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్టీ అనుబంధ సంఘాల నేతలతో, జిల్లాల నాయకులతో భేటీ అవుతున్నారు. వారంలో రెండు రోజులు తాడేపల్లిలో ఉంటున్న జగన్… క్యాడర్‌లో ఉత్సాహం నింపేందుకు తీవ్రంగా యత్నిస్తున్నారు. వైసీపీ ఘోర పరాజయం తర్వాత పార్టీ శ్రేణుల్లో నిరుత్సాహం కనిపిస్తోంది. సోషల్ మీడియాలో తప్ప… క్షేత్రస్థాయిలో ఆశించిన మేర ఎక్కడా వైసీపీ నేతల్లో సరైన స్పందన కనిపించటం లేదు. ఇక జగన్ కూడా ఎక్కువగా బెంగళూరులోనే ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదేళ్లు క్యాడర్‌కు దూరంగా ఉండటం వల్లే ఘోరంగా ఓడిపోయామని సొంత పార్టీ నేతలే విమర్శలు చేస్తున్నారు. దీంతో ఆ అపవాదును తొలగించేందుకు వైఎస్ జగన్ నానా పాట్లు పడుతున్నారు. పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మీరే నా ప్రాణం అంటూ కొత్త డైలాగ్ చెబుతున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా సరే.. జనాల్లోకి వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్న జగన్.. అనుబంధ సంఘాలకు కొత్త నేతలను నియమిస్తున్నారు. అలాగే కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు.ముఖ్యంగా తెలుగుదేశం పార్టీనే మెయిన్ టార్గెట్ చేశారు. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలు గడివిస్తామంటూ తొలి నాళ్లల్లో చెప్పిన మాటను జగన్ మర్చిపోయినట్లున్నారు. నెల రోజులుకూడా కాక ముందు నుంచే విమర్శలు చేస్తూనే ఉన్నారు.ఓ వైపు జగన్ తీరు నచ్చక పార్టీలో సీనియర్లు వైసీపీకి గుడ్ బై చెబుతున్నారు. వైసీపీలో ఉంటే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదేమో అనే ఆలోచనతోనే పార్టీ వీడుతున్నట్లు తెలుస్తోంది. ఇక మరో ఏడాదిలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ లోపే వైసీపీ నుంచి ఇతర పార్టీల్లోకి భారీగా చేరికలలు ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పార్టీ కేడర్‌ను కాపాడుకునేందుకు జగన్ తీవ్రంగా శ్రమిస్తున్నట్లు తెలుస్తోంది. కార్యకర్తల్లో ఉత్సాహంనింపేందుకు ఒకడుగు ముందుకేసిన జగన్… ఏపీలో మళ్లీ అధికారంలోకి వచ్చేది మన ప్రభుత్వమే అంటూ పార్టీ నేతలకు జోస్యం చెప్పారు జగన్. అయితే జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై పార్టీ నేతలో విమర్శలు చేస్తున్నారు. ముందు పార్టీని వీడుతున్న కేడర్‌ను కాపాడుకోకుండా… ఎప్పుడో నాలుగున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో గెలిచేది మనమే… మనమేప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటూ జగన్ చెప్పడం దేనికి సంకేతమనే చర్చ పార్టీలో జోరుగా నడుస్తోంది. జగన్ బెంగళూరు వెళ్లి జోస్యం నేర్చుకున్నారా అని కామెంట్లు చేస్తున్నారు.వై నాట్ 175 అని గొప్పగా చెప్పుకున్న జగన్‌కు… ఎన్నికల్లో కనీసం ప్రతిపక్ష హెూదా కూడా దక్కలేదు. సింహం సింగిల్ అంటూ పెద్ద పెద్ద డైలాగులు చెప్పినప్పటికీ… ప్రజలు మాత్రం కూటమికే పట్టం కట్టారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని… వ్యవస్థలను అస్తవ్యస్తం చేశారనే ఆరోపణలను జగన్ మూటగట్టుకున్నారు. అసలే అప్పుల ఊబిలో చిక్కుకున్న రాష్ట్రాన్ని కాపాడుతున్నామంటూ సీఎం చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. అయినా సరే… జగన్ మాత్రం అధికారం మనదే… మన ప్రభుత్వమే వస్తుందంటూ వ్యాఖ్యానించడం జోస్యం చెప్పినట్లే ఉందంటున్నారు రాజకీయ విశ్లేషకులు.



# వెలిగొండ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలి

మొదటి పేజి తరువాయి



కుంటున్నాయని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కొంతమేరకు పురోగమనములో పయనించాయని అన్నారు. మిగతా ముఖ్యమంత్రులు ఎవరు కూడా ఈ ప్రాజెక్టు గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. లక్షల కోట్ల రూపాయలను సంక్షేమ పథకాలు పేరుతో వెదజల్లుతున్న పాలకవర్గాలు కేవలం రూ 2 వేల కోట్ల నిధులు కేటాయిస్తే వెలుగొండ ప్రాజెక్టు పూర్తవుతుందని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలోని 32 మండలాలలో 4 లక్షల 32 వేల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మందికి పైగా త్రాగునీరు అందుతుందని అన్నారు. దేశంలోనే అతి తక్కువ నిధులతో ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు ఎక్కడా లేదని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలని, నిర్వాసితులను ఆదుకోవాలని, అలాగే వెనుకబడిన మార్కాపురాన్ని జిల్లా చేయాలని కోరుతూసిపిఐ ఆధ్వర్యంలో ప్రతినిధి  బృందం దసరా ఉత్సవాల అనంతరం మంత్రులను, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలసి వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే సంస్థలు పరిష్కారం అవుతాయని కావున భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి ఈశ్వరయ్య మాట్లాడుతూ అనుత్పాదక రంగాలకు లక్షల కోట్ల రూపాయలను వ్యయం చేస్తున్న పాలకవర్గాలు ఉత్పాదక రంగానికి కేందం కానున్న  పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు ఎందుకు నిధులు కేటాయించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని ఉత్పాదక రంగాలకు పెద్దపీట వేయాలని ముఖ్యంగా వ్యవసాయ రంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనాదిగా ప్రకాశం జిల్లా అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబాటు తనానికి గురవుతూ వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామికంగా, వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందకుండాజిల్లా ఏ విధంగా పురోగతి సాధిస్తుందని ఆయన ప్రశ్నించారు. గత పాలకవర్గాలు దొనకొండ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని మాయమాటలు చెప్పడమే తప్ప, ఎక్కడ కూడా అమలకు నోచుకోలేదని ఆయన విమర్శించారు. గతంలో పశ్చిమ ప్రకాశంలో పలకల పరిశ్రమ ఈ ప్రాంత ప్రజలకు పెద్ద ఎత్తున జీవనోపాధి కల్పించేదని, అయితే పాలకవర్గాల నిరాదరణతో ఈ రంగం కూడా పూర్తిగా సంక్షోభంలోకి కూరుకు పోయిందని ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తం చేశారు.సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్. నారాయణ మాట్లాడుతూ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ. 2,000 కోట్ల  నిధులను కేటాయించాలని కోరుతూ ప్రాజెక్టు పరిధిలోని మండల కేంద్రాలలో రెవెన్యూ కార్యాలయాలలో, ఆయా నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేయాలని, అలాగే నవంబర్ 18 వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ముంపు గ్రామాల బాధితులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించడం జరిగిందని అన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలో భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతున్నాయని, దీంతో ఫ్లోరైడ్ నీటిని అనివార్యంగా ప్రజలు తాగాల్సిన దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు.వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం సిపిఎం ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్ కె. సైదా, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ వి సుదర్శన్, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి అందే నాసరయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి, జిల్లా సిపిఐ నాయకులు టి సి హెచ్. చెన్నయ్య కె.వి కృష్ణ గౌడ్, పట్టణ సిపిఐ నాయకులు ఎస్కే కాసిం, సిహెచ్. పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి డి. సోమయ్య, ఉదయగిరి ఏరియా సిపిఐ నాయకులు మాలకొండ రెడ్డి, డాక్టర్శ్యాం ప్రసాద్, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె అబ్దుల్ రజాక్, సిఐటియు జిల్లా అధ్యక్షులు డీకే ఎం రఫీ,  పూల సుబ్బయ్య కాలనీ శాఖ కార్యదర్శి డి అల్లూరయ్య పాల్గొన్నారు.




# బాణాసంచా గోడౌన్ లో పేలుడు - ముగ్గురు మృతి



(అగ్ని ప్రతినిధి,తమిళనాడు)తిరుపూర్ జిల్లాలో బాణసంచా గోడౌన్‌లో పేలుడు సంభవించింది. ఈ సంఘటన లో ముగ్గురు మృతి చెందగా, నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.ఇళ్ల మధ్యలో ఉన్న బాణసంచా గోడౌన్‌పేలుడు ధాటికి 10 ఇళ్లు ధ్వంసం కావడంతో,ప్రజలు భయంతో పరుగులు తీశారు.

# కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వం



అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 08): కాలేజీ రోడ్డు లో మార్కాపురం బిజెపి పట్టణ ముస్లిం మైనార్టీ మోర్చా అధ్యక్షులు బాషా ఆధ్వర్యంలో బీజేపీ నూతన సభ్యత నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి పివి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పెద్ద సంఖ్యలో బీజేపీ లో చేరుతున్నట్లు తెలిపారు.

# 14 న మండల సర్వసభ్య సమావేశం

అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 08): మార్కాపురం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 14వ తేదీన జరుగుతుంది అని ఇన్చార్జి ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. మార్కాపురం మండల పరిషత్ కార్యాలయపు సమావేశపు హాలులో సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, అన్ని శాఖల అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.



# పంటలు పండక.... అప్పులు తీరక రైతు బలవన్మరణం.. !

## - విషాదం లో సిద్ది నాయుడుపల్లె

అగ్ని న్యూస్, పెద్దారవీడు(అక్టోబర్ 08): పంటలు పండక, అప్పుల తీరక మనస్తాపంతో దళిత రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దారవీడు మండలం సిద్ది నాయుడు పల్లె గ్రామం లో చోటుచేసుకున్నది. స్థానికుల సమాచారం ప్రకారం...పెద్దారవీడు మండలం సిద్ధినాయునిపల్లిలో రుద్రపాటి చిన్న వెంకట చెన్నయ్య (70) అనే రైతువ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. పంటలు సరిగ్గా పండక బోర్లకు నీరు రాక లక్షలలో అప్పు చేశాడు. రుద్రపాటి చిన్న వెంకట చెన్నయ్య (70) మృతుడు గంతంలో పోక్సో కేసులో నిందితుడు. దీంతో అప్పు మరింత పెరిగింది. వీటిని ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గురయ్యాడు. మంగళవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన చుట్టుపక్కల వారు 108 వాహనంలో మార్కాపురం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పెద్దారవీడు ఎస్సై. అనిల్ కుమార్ తెలిపారు

# గజ్జలకొండ లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు



అగ్ని న్యూస్, మార్కాపురం (అక్టోబర్ 08): మండలంలోని గజ్జలకొండలో వెలసి ఉన్న శ్రీ రాజరాజేశ్వరి పీఠం నందు దసరా నవరాత్రి మహెూత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాజ రాజేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు.పీఠం నిర్వాహకులు సిరసనగండ్ల శ్రీనివాస్ శర్మ, చంద్రశేఖర్ శర్మ లు కార్యక్రమాలను పర్యవేక్షించారు.మహిళా భక్తులు వందలాదిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

తక్కువ పెట్టుబడి.
ఎక్కువ భూమి..
అత్యధిక ఆదాయం...

V GROW DEVELOPERS

# సిరి క్షేత్రం

ఎర్ర చందనం వ్యవసాయ భూములు

మన మార్కాపురం వాసులచే ప్రారంభించబడిన
మొట్ట మొదటి రెడ్ శాండిల్ వెంచర్స్ కంపనీ

60 ఎకరాల విస్తీర్ణంలో

కేవలం 746/- కే గజం



## సిరి క్షేత్రం

లో పెట్టుబడి తో..

## మీ పిల్లల భవిష్యత్తు కు బంగారు బాటలు వేయండి



మరింత సమాచారం కొరకు సంప్రదించండి

**+91 9111 822 822**

**కంపెనీ డైరెక్టర్స్**

మేడం సత్యనారాయణ
దొంతిరెడ్డి వెంకటరెడ్డి
జవ్వాజి సాయికృష్ణ

Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)